లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ అపూర్వ నూతన కమిటీ


కమిటీ అధ్యక్షుడు సూర్యనారాయణ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ హైదరాబాద్‌ అపూర్వ డిస్ట్రిక్ట్‌ 320ఏ రిజియన్‌–7 జోన్‌ 2 నూతన అధ్యక్షుడిగా లయన్‌ డా. ఈఎస్‌ సూర్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో రిటైర్డ్‌ జాయింట్‌ కలెక్టర్‌ లయన్‌ టి.నైనాదేవి, అపూర్వ క్లబ్‌ చార్టర్‌ ప్రెసిడెంట్‌ లయన్‌ వై. సుధాకర్‌రావు, క్లబ్‌ సభ్యుల సమక్షంలో నిర్వహించిన ఎన్నికల్లో నూతన కమిటీ ఎన్నికైనట్లు సూర్యనారాయణ తెలిపారు. కార్యదర్శి డాక్టర్‌ ఎల్‌. మహేష్‌,కోశాధికారిగా టి.నైనాదేవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవం జూలై 6వ తేదీ ఆదివారం లయన్స్‌ భవన్‌ సికింద్రాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్స్‌ క్లబ్‌ఇంటర్నేషనల్‌ డిస్ట్రిక్ట్‌ 320ఏ గవర్నర్‌ డా.జి.మహేందర్‌ కుమార్‌రెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు.

ఇందిరాగాంధీ విగ్రహ దిమ్మెను పునర్‌ నిర్మించాలి

ముషీరాబాద్‌: ఇందిరాపార్కులోని మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహ దిమ్మె పూర్తిగా శిథిలావస్థకు చేరిందని మాజీ కార్పొరేటర్‌ వాజీద్‌ హుస్సేన్‌ అన్నారు. దిమ్మెను పునర్‌ నిర్మించాలని సోమవారం ప్రజావాణిలో జెడ్‌సీ రవికిరణ్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్‌ నేత నేత వీడీ కృష్ణ పాల్గొన్నారు.

ఆర్టీఐ సాధన కమిటీకి అవార్డు

కాచిగూడ: సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) సాధన కమిటీకి 2025 సంవత్సరానికి గాను సామాజిక సేవా విభాగంలో బెస్ట్‌ ఎన్జీవో ఆఫ్‌ ది ఇయర్‌ అవార్డు లభించింది. కమిటీ జాతీయ అధ్యక్షుడు డా. చంటి ముదిరాజ్‌ ఆధ్వర్యంలో చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి స్ఫూర్తి సర్వీసెస్‌ సొసైటీ ఇండియా సంస్థ సోమవారం ఈ అవార్డును అందజేసింది. ఈ సందర్భంగా డా. చంటి మాట్లాడుతూ.. సమష్టి కృషితో అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు.

పెన్షనర్లు ఐక్యంగా ఉంటూ హక్కులను కాపాడుకోవాలి

చిక్కడపల్లి: పెన్షనర్లంతా ఐక్యంగా ఉంటూ హక్కులను కాపాడుకోవాలని ఏఐఎస్‌పీఎఫ్‌ ప్రధాన కార్యదర్శి సుధాకర్‌ అన్నారు. అసోసియేషన్‌ ఫర్‌ ఆంధ్రప్రదేశ్‌ పెన్షనర్స్‌ సెటిల్డ్‌ హైదరాబాద్‌ ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయ గానసభలో నిర్వహించిన పెన్షనర్ల మానసిక వేదనపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం పెన్షనర్లకు ప్రమాద సంకేతాన్ని ఇస్తోందని అన్నారు. పార్లమెంటులో చేసిన చట్టం రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందన్నారు. పెన్షనర్ల రూల్స్‌ సవరించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు.

ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి

కాచిగూడ: విద్యార్థులతో పాటు మహిళలు ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలని ఈస్ట్‌ జోన్‌ అడిషనల్‌ డీసీపీ జె.నర్సయ్య అన్నారు. సోమవారం కాచిగూడలోని జీవీఆర్‌ కరాటే అకాడమిలో కరాటేలో వరల్డ్‌ రికార్డ్స్‌ సాధించిన అక్కాచెల్లెళ్లు అమృతరెడ్డి, ఘణ సంతోషిణి రెడ్డిని ఆయన సత్కరించి అభినందించారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు కరాటే నేర్పించాలన్నారు.

పీవైఎల్‌ గ్రేటర్‌ నూతన కమిటీ

ముషీరాబాద్‌: ప్రొగ్రెసివ్‌ యూత్‌ లీగ్‌ (పీవైఎల్‌) గ్రేటర్‌ హైదరాబాద్‌ జనరల్‌ కౌన్సిల్‌ సమావేశం సోమవారం విద్యానగర్‌లోని మార్క్స్‌ భవన్‌లో జరిగింది. నూతన కమిటీని పీవైఎల్‌ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్‌ ప్రదీప్‌ ప్రకటించారు. నూతన అధ్యక్షులుగా బీఎస్‌ కృష్ణ, కార్యదర్శిగా కొల్లూర్‌ భీమేష, ఉపాధ్యక్షులు బండారి శ్రీనివాస్‌, మల్లేష్‌, సహాయ కార్యదర్శులుగా కుంబోజి కిరణ్‌, బాలు, కోశాధికారిగా ప్రకాష్‌తో పాటు 10మంది సభ్యులతో కలిపి మొత్తం 17మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కాచిగూడ: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్‌ ఆర్‌.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... వెస్ట్‌ బెంగాల్‌కు చెందిన బరుణ్‌ మండల (26) బుద్వేల్‌ రైల్వే స్టేషన్‌ వద్ద పట్టాలు దాటుతుండగా తీవ్రంగా గాయపడ్డారు. ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమవారం కుటుంబ సభ్యులు కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్‌ ఆర్‌.ఎల్లప్పతెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడ–యాకుత్‌పుర రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (40) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

ఆటోడ్రైవర్‌ను బెదిరించిన ఇద్దరి రిమాండ్‌

కాచిగూడ: జామై ఉస్మానియా రైల్వేస్టేషన్‌ వద్ద ఈనెల 26న ఆటోడ్రైవర్‌ను బెదిరించి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్‌, రూ.3వేలను దొంగిలించిన ఇద్దరు యువకులను కాచిగూడ రైల్వే పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్‌ ఆర్‌.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. రాఘవేంద్ర స్వామి(20), శశాంక్‌ (19)లు ఆటోడ్రైవర్‌ బనావత్‌ సేవాలాల్‌ను బెదిరించి సెల్‌ఫోన్‌, నగదు లాక్కెళ్లారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కృష్ణానగర్‌ నాలా.. అభివృద్ధిపై నిర్లక్ష్యమేల?


విద్యుత్‌ శ్మశానవాటిక వద్ద కూలిపోయిన నాలా ప్రహరీ

- పేరుకుపోయిన చెత్తాచెదారం
- విజృంభిస్తున్న దోమలు
- కంపుకొడుతున్న నాలా
- పట్టించుకోని అధికారులు
- స్థానికులకు తప్పని తిప్పలు


రహదారిలోనే నాలా పూడిక


పోచమ్మ గుడి పక్కనే మట్టికుప్పల డంపింగ్‌

కాచిగూడ: జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్‌ పరిధిలోని పలు ఓపెన్‌ నాలాలు పూర్తిగా చెత్తాచెదారంతో నిండిపోయాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు చెత్తనంతా తమకు దగ్గరలో ఉండే నాలాల్లో పడేస్తున్నారు. పారిశుద్ధ్య విభాగం సిబ్బంది కూడా ఆయా ప్రాంతాల్లో చెత్తను ఊడ్చి నాలాల్లో పడవేస్తున్న సంఘటనలు ఉన్నాయి. అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలోని గోల్నాక, నల్లకుంట, అంబర్‌పేట తదితర ప్రాంతాల్లో ఉన్న ఓపెన్‌ నాలాల పరిస్థితి దుర్భరంగా మారాయి. ఈ నాలాలకు పై కప్పులు లేకపోవడంతో చెత్తనంతా నాలాల్లోనే పడవేస్తున్నారు. ప్రధానంగా ఓపెన్‌ నాలాల్లో చెత్తా చెదారం వేయకుండా జీహెచ్‌ఎంసీ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

◆ ఈ మేరకు ఉన్నత స్థాయి అధికారులు చర్యలు చేపడుతున్నారే కాని కిందిస్థాయి సిబ్బంది పట్టించుకోవడం లేదనే ఆరోపణలు బలంగా వినిస్తున్నాయి. నాలాల్లో చెట్లు, పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగి అధ్వాన స్థితికి చేరుకున్నాయి. పలు నాలాల్లో సాయంత్రం అయితే సరి నాలాల ప్రాంతాల్లో దోమల మోతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలాల్లో పేరుకుపోయిన పూడికను తీసి వేసి పిచ్చి మొక్కలను తొలగించి, అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫెన్సింగ్‌ ధ్వంసమైనా పట్టించుకోవడం లేదు..

◆ గోల్నాక డివిజన్‌ కృష్ణానగర్‌ బస్తీలోని నాలాను చూస్తే అసలు ఇది నాలానేనా..? అనే అనుమానం కలుగుతుంది. ఏళ్లు గడుస్తున్నా నాలా అభివృద్ధికి నోచుకోవడం లేదు. నాలా దుస్థితిపై స్థానికులు అధికారులనే బాధ్యులుగా చూస్తున్నారు. నాలాలో వ్యర్థాల డంపింగ్‌ కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు పూర్తిగా మరిచారు. ఎప్పుడో ఏడాదికి ఒకసారి గట్టిదనం లేని ఫెన్సింగ్‌ ఏర్పాటు చేస్తున్న అధికారులు ఫెన్సింగ్‌ ధ్వంసమైనా పట్టించుకోవడం లేదు. పలువురు రాత్రిపూట గుట్టుచప్పుడు కాకుండా వ్యర్థాలను తెలిచ్చ నాలాలో డంపింగ్‌ చేస్తున్నారు. ఈ విధంగా నాలాలో వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి.

దుర్గంధం వెదజల్లుతున్న నాలా...

◆ కృష్ణానగర్‌ నాలాలో నీరు పూర్తిగా నల్లగా మారి దుర్గంధాన్ని వెదజల్లుతోంది. నాలా పరిసరాల వారు తాము దుర్గంధంతో సావాసం చేస్తున్నామని అంటున్నారు. వర్షాకాలంలో నాలా పొంగిపొర్లుతూ తమ ఇళ్లలోకి వరద చొచ్చుకు వస్తోందని స్థానికులు అంటున్నారు. నాలాకు ఎత్తయిన ప్రహరీ నిర్మించి ఫెన్సింగ్‌ వేసి వరద నీరు పొంగకుండా చూడాలని ముందుగా నాలాలోని వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయం పక్కనే వ్యర్థాలు



బోనాలా వేడుకలు జరుపుకునే నల్లపోచమ్మ ఆలయం పక్కనే నాలాలో తీసిన దుర్గంధాన్ని డంపింగ్‌ చేశారు. గుట్టలుగా పేరుకుపోయిన చెత్త డంపింగ్‌తో దుర్వాసన వెదజల్లుతోంది. ఇలా ఉంటే బోనాలా పండుగ ఎలా జరుపుకోవాలి. అధికారులు స్పందించి చెత్త, మట్టికుప్పలను తొలగించాలి.

– నందు, కృష్ణానగర్‌

ఇళ్ల మధ్యనే వ్యర్థాలు



నాలా నుంచి తీసిన మట్టి,చెత్తను ఇళ్ల మధ్యే రోడ్డుపై పడేశారు. రోడ్డు మీదుగా నడవడానికి కూడా వీలు లేకుండా వ్యర్థాలను వేశారు. దీంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నాం. నాలాలో పూర్తిగా చెత్తను తొలగించి నాలాకు ఇరువైపుల ఫెన్సింగ్‌ ఏర్పాటు చేయాలి.

– రాజ్యలక్ష్మి, స్థానికుడు

రోగాల బారిన పడుతున్నాం..



నాలాలలో పూడికతీతను సరిగ్గా చేపట్టక పోవడంతో పరిశుభ్రత కొరవడి దోమల పెరుగుదలకు ఆస్కారం ఏర్పడుతుంది. దుర్గంధపూరిత పదార్థాలు నిల్వ ఉండడంతో దోమలు విపరీతంగా వ్యాప్తి చేందుతున్నాయి. దోమకాటుకు మలేరియా వ్యాధి, ఇతర వ్యాధుల బారిన పడాల్సి వస్తోంది.

– సుధాకర్‌, స్థానికుడు

మహిళా పోరాటాలకు స్ఫూర్తి సుగుణమ్మ


ఎస్వీకేంద్రంలో శాఖమూరి సుగుణమ్మ సంస్మరణ సభలో నివాళులర్పిస్తున్న ఐద్వా ప్రతినిధులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ఐద్వా నాయకురాలు శాఖమూరి సుగుణమ్మ సంస్మరణ సభ సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి ఐద్వా రాష్ట్ర కమిటీ ప్రతినిధులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. మహిళా పోరాటాలకు స్ఫూర్తి సుగుణమ్మ అని కొనియాడారు. సారా ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. సుందరయ్య ఇచ్చిన పిలుపులో భాగంగా తెలంగాణ విముక్తి కోసం జరిగిన పోరాటంలో 8 ఏళ్ల వయస్సులోనే తెలంగాణ సాయుధ పోరాటంలో కొరియర్‌గా పనిచేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు రజిని, పీఎస్‌ఎన్‌ మూర్తి, జర్నలిస్ట్‌ జమునా, డి.ఇందిరా, ఐద్వా అధ్యక్షురాలు అరుణజ్యోతి, టి.జ్యోతి, విమలక్క, పసుపులేటి రమ, బి.హైమావతి, రజని, నాగలక్ష్మి, శశికళ, శోభా తదితరులు పాల్గొన్నారు.

మాలబస్తీలో సిమెంట్‌ స్తంభం ఏర్పాటు


మాలబస్తీలో స్తంభం ఏర్పాటు పరిశీలిస్తున్న ఏఈ అశోక్‌, నాయకులు

చిక్కడపల్లి: డివిజన్‌లోని మాలబస్తీలో కొంత కాలంగా విద్యుత్‌ తీగలు ప్రమాదకరంగా మారాయని స్థానికులు చెబుతున్నారు. అంబేద్కర్‌ విగ్రహానికి అడ్డంగా ఉన్న విద్యుత్‌ స్తంభాన్ని తొలగించి సిమెంట్‌ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ విషయాన్ని ఆమె సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు స్పందించిన వారు సోమవారం సిమెంట్‌ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. బస్తీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కార్పొరేటర్‌ పావని చొరవతో కృషి చేస్తున్నామని బీజేపీ నేత వినయ్‌కుమార్‌ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ సంతోష్‌, బీజేపీ నాయకులు మదన్మోహన్‌, ఆనంద్‌రావు, అరుణ్‌కుమార్‌, జ్ఞానేశ్వర్‌, ప్రశాంత్‌, బస్తీ వాసులు పాల్గొన్నారు.

అయోధ్యరాములు మృతి పార్టీకి తీరని లోటు


అయోధ్య రాములు కుటుంబీకులను పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట: పార్టీ అభ్యున్నతికి చిత్తశుద్ధి, నిబద్ధతో కృషి చేసిన సీనియర్‌ బీజేపీ నాయకులు అయోధ్య రాములు ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి సోమవారం ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం అయోధ్యరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు ఎస్‌.గౌతంరావు, నరేష్‌గౌడ్‌, నాగభూషణం చారి, యశ్వంత్‌, మైలారం రాజు, శ్రీకాంత్‌, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీ యాదగిరికి సన్మానం

ముషీరాబాద్‌: బోనాల ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని గాంధీనగర్‌ ఏసీపీ యాదగిరి అన్నారు. గాంధీనగర్‌ ఏసీపీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన యాదగిరిని సోమవారం బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజలు పండుగలను ఐక్యంగా జరుపుకుంటూ మతసామరస్యాన్ని కాపాడాలని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

మేడ అనురాధకు డాక్టరేట్‌



కాచిగూడ: మాస్‌ కమ్యూనికేషన్‌ అండ్‌ జర్నలిజంలో అనురాధ మేడకు ఓయూ డాక్టరేట్‌ ప్రకటించింది. 'ఎన్విరాన్‌మెంటల్‌ న్యూస్‌ కవరేజ్‌ ఇన్‌ సెలెక్టెడ్‌ ఇంగ్లిష్‌ డైలీస్‌'అనే అంశంపై సమర్పించిన తన థీసిస్‌కు గాను ఈ డాక్టరేట్‌ లభించింది. ప్రొఫెసర్‌ కె.నరేందర్‌ పర్యవేక్షణలో అనురాధ తన థీసిస్‌ను పూర్తి చేశారు. భోలక్‌పూర్‌కు చెందిన మేడ అనురాధ ప్రస్తుతం సెయింట్‌ జోసెఫ్‌ డిగ్రీ అండ్‌ పీజీ కళాశాలలో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

16 కోట్ల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

జాతీయ బీసీ జేఏసీ ఛైర్మన్‌ కోల జనార్దన్‌


వంశీకృష్ణకు నియామక పత్రాన్ని అందజేస్తున్న కోల జనార్దన్‌

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 16 కోట్ల ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని జాతీయ బీసీ జేఏసీ ఛైర్మన్‌ కోల జనార్దన్‌ డిమాండ్‌ చేశారు. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడంలో కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. సోమవారం కాచిగూడ అభినందన్‌ గ్రాండ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్‌ గుజ్జ కృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ నిరుద్యోగ జేఏసీ ఛైర్మన్‌గా జక్కుల వంశీకృష్ణను నియమించారు. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని వచ్చే పార్లమెంట్‌ సమావేశాల సందర్భంగా నిరుద్యోగులతో కలిసి ఢిల్లీ పార్లమెంట్‌ భవన్‌ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు దేశ వ్యాప్తంగా నిరుద్యోగులను సమాయత్తం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, నారాయణగౌడ్‌, ఉదయ్‌ నేత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అజామాబాద్‌ డివిజన్‌ పరిధిలో విద్యుత్‌ మరమ్మతులు నిమిత్తం పలు ప్రాంతాలలో మంగళవారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. బాలాజీనగర్‌ ఫీడర్‌ పరిధిలోని అంబర్‌నగర్‌, లలితనగర్‌, రాంనగర్‌ గుండు తదితర ప్రాంతాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు... అడికిమెట్‌ ఫీడర్‌ పరిధిలోని రాంనగర్‌, అడిక్‌మెట్‌, విద్యానగర్‌ తదితర ప్రాంతాలలో 12 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు... ఎల్‌ఎన్‌ నగర్‌ ఫీడర్‌ పరిధిలోని వారసిగూడ, అశోక్‌నగర్‌ నాలా, పుల్లయ్య బావి, అంబర్‌నగర్‌ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్ర 5గంటల వరకు విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

సర్టిఫికెట్ల కోసం దళారులను ఆశ్రయించొద్దు

ముషీరాబాద్‌: ముషీరాబాద్‌ తహసీల్దార్‌ కార్యాలయంలో కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం దళారులను ఆశ్రయించొద్దని ముషీరాబాద్‌ తహసీల్దార్‌ రాణా ప్రతాప్‌సింగ్‌ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... సర్టిఫికెట్ల జారీలో ఎలాంటి జాప్యం లేకుండా దరఖాస్తుదారులకు సకాలంలో సర్టిఫికెట్లు అందజేస్తున్నామని తెలిపారు. అదే విధంగా ప్రభుత్వ పథకాలైన షాదీముబారక్‌, కల్యాణలక్ష్మి కోసం దళారుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు.

దైవ సేవకురాలు యేసు మణెమ్మ జీవితం ఆదర్శం



ముషీరాబాద్‌: హైదరాబాద్‌ జంట నగరాలలో మొట్టమొదటి మహిళా పాస్టర్‌గా చర్చి సేవలు ప్రారంభించిన యేసు మణెమ్మ జీవితం క్రైస్తవులకు ఆదర్శదాయకమని పాస్టర్‌ విజయ్‌ కొనియాడారు. ఇటీవల మరణించిన బెతెస్థా ప్రేయ్‌ ఫెలోషిప్‌ చర్చి వ్యవస్థాపకురాలు యేసు మణెమ్మ జ్ఞాపకార్థ సభ సోమవారం రాంనగర్‌ డివిజన్‌లోని జెమినికాలనీలో జరిగింది. ఈ సందర్భంగా పాస్టర్లు, క్రైస్తవ సంఘ సేవకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యా, వైద్య, వృత్తి శిక్షణ సలహాలిస్తూ వారిని దైవభక్తిలో నడిపించారని తెలిపారు. వందలాది కుటుంబాలకు తన బైబిల్‌ వాక్య పరిచర్యతో క్రైస్తవ విశ్వాసం మార్గంలో నడిపించారని పేర్కొన్నారు. రాంనగర్‌, మొయినాబాద్‌, సంగారెడ్డి, పటాన్‌చెరువు తదితర ప్రాంతాల్లో సుమారు 30మందికి పైగా పాస్టర్లను చర్చిలను స్థాపించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మణెమ్మ కుమారుడు జి.డేవిడ్‌, జి.విజయ్‌కుమార్‌, కుటుంబ సభ్యులు షారోన్‌, ప్రవీణ్‌, శిరిషా, రజిత, రిత్విక్‌, ధరణి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌ ఆటో డ్రైవర్‌పై డీడీ కేసు నమోదు



చిక్కడపల్లి: మద్యం సేవించి ఆటో నడుపుతున్న డ్రైవర్‌పై చిక్కడపల్లి ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ వీరేశం డీడీ కేసు నమోదు చేశారు. అశోక్‌నగర్‌ చౌరస్తాలో సోమవారం ట్రాఫిక్‌ పోలీసులు డ్రంకన్‌ డ్రైవ్‌పై స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించారు. మద్యం సేవించి స్కూల్‌ ఆటో నడుపుతున్న వ్యక్తిని పరీక్షించగా మద్యం సేవించినట్లు గుర్తించారు. ఈ మేరకు ఆయనపై కేసు నమోదు చేశారు. మరో ఆటో డ్రైవర్‌ పరిమితికి మించి స్కూల్‌ విద్యార్థులను తీసుకెళ్తున్నట్లు గుర్తించి అతడిపై సైతం కేసు నమోదు చేశారు. ఈ తనిఖీలలో ఎస్సైలు యాదగిరి, సాయిరామ్‌, సుందర్‌రాజ్‌, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణ రాయభారం పద్యనాటకం

చిక్కడపల్లి: కల్పన కళానికేతన్‌, రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో పద్యనాటక వేడుకలను సోమవారం త్యాగరాయ గానసభలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ తులాభారం, శ్రీకృష్ణ రాయభారం పద్య నాటకాలను కళాకారులు ప్రేక్షకరంజకంగా ప్రదర్శించారు. శ్రీకృష్ణుడుగా కిషోర్‌కుమార్‌, దుర్యోధనుడిగా జి.శ్రీనివాస్‌, అర్జునుడుగా దొంతి జంగయ్యగౌడ్‌, నారదుడిగా సర్వేశ్వరరావు, వసంతకుడిగా మల్లాది భాస్కర్‌, సత్యభామగా సాయిలక్ష్మి, రుక్మిణీదేవిగా సురభి వెంగమాంబ, నళినిగా మాధవి పాత్రోచితంగా నటించి ప్రదర్శనను రక్తికట్టించారు. అనంతరం జరిగిన సమావేశంలో వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు ముఖ్యఅతిథిగా హాజరై కళాకారులను అభినందించి సన్మానించారు.

కాచిగూడ డిపోలో పలువురి ఉద్యోగ విరమణ

కాచిగూడ: ఆర్టీసీ కాచిగూడ డిపోలో పలువురు సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోల్నాక కార్పొరేటర్‌ లావణ్య పాల్గొని ఉద్యోగ విరమణ చేసిన డ్రైవర్‌ టి.లాలయ్యగౌడ్‌, ఎం.వేమారెడ్డిను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆర్టీసీ అభివృద్ధికి వారు చేసిన కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్‌, ఎంటీ కిషోర్‌కుమార్‌, నర్సింగ్‌రావు, పోచాలు, సతీష్‌, మహేష్‌ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

అంబర్‌పేట డిప్యూటీ తహసీల్దార్‌ బలరామ్‌



నల్లకుంట: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అంబర్‌పేట మండలం డిప్యూటీ తహసీల్దార్‌ నిమ్మన్నగారి బలరామ్‌ అన్నారు. కాంగ్రెస్‌ పార్టీ నల్లకుంట డివిజన్‌ అధ్యక్షుడు జి. లక్ష్మణ్‌ ఆధ్వర్యంలో సోమవారం నర్సింహబస్తీ కమ్యూనిటీహాల్‌లో 'సివిల్‌ రైట్స్‌ డే'ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ తహసీల్దార్‌ బలరామ్‌ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలు అన్ని రకాల చట్టాలపై అవగాహనతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన అవసరమని బస్తీవాసులకు సూచించారు. ఎస్సీ విద్యార్థుల కోసం ప్రభుత్వ సోషల్‌ వెల్ఫేర్‌ పాఠశాలలు, వసతి గృహాలు ఉన్నాయన్నారు. వాటిలో చేరి చదువుకుంటే విద్యార్థుల భవిష్యత్‌ బాగుంటుందన్నారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీలో సమస్యలు ఏమైనా ఉన్నాయా? కుల దూషణలు జరుగుతున్నాయా? అని బస్తీవాసులను అడిగారు. అట్రాసిటీ చట్టంపై ఎంత మందికి అవగాహన ఉంది అని బస్తీ వాసులను అడిగి తెలుసుకున్నారు.

ఆపదలో ఉంటే 100కు సమాచారం ఇవ్వండి..

మహిళలు, బాలికలు బయటకు వెళ్లిన సమయంలో ఏదైనా ఆపదలో ఉంటే వెంటనే డయల్‌ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. దీంతో పోలీసుల నుంచి రక్షణ పొందవచ్చని నల్లకుంట ఎస్సై లక్ష్మీనారాయణ తెలిపారు. ఎక్కడైనా విద్యార్థినులు, మహిళలకు ఆకతాయిల నుంచి వేధింపులు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్‌ వర్క్స్‌ శివం సెక్షన్‌ మేనేజర్‌ రోహిత్‌, సివిల్‌ సప్లై అసిస్టెంట్‌ రెహమాన్‌, ఎలక్ట్రిసిటీ ఏఈ నాగరాజు, నర్సింహబస్తీ అధ్యక్షుడు భూపతినాథ్‌, కార్యదర్శి శ్రీనివాస్‌, బస్తీ పెద్దలు మహేందర్‌, కె.లక్ష్మణ్‌కుమార్‌, ఎస్‌.బాబు, సి.ప్రేమ్‌, సత్యనారాయణ, రమేష్‌, ప్రభురాజ్‌, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

సత్యానగర్‌లో పౌర హక్కులపై అవగాహన


సివిల్‌ రైట్స్‌ డేలో పాల్గొన్న డిప్యూటీ తహసీల్దార్‌ రఘు, ఇన్‌స్పెక్టర్‌ జ్యోత్స్న, కార్పొరేటర్‌ అమృత

నల్లకుంట డివిజన్‌ పరిధిలోని సత్యానగర్‌ కమ్యూనిటీహాల్‌లో సోమవారం పౌర హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి హాజరైన హిమాయత్‌నగర్‌ మండలం డిప్యూటీ తహసీల్దార్‌ రఘు, కాచిగూడ ఇన్‌స్పెక్టర్‌ జ్యోత్స్న, కార్పొరేటర్‌ అమృత బస్తీవాసులకు ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాచిగూడ పీఎస్‌ ఎస్సై సుభాష్‌, జీహెచ్‌ఎంసీ అధికారి, వాటర్‌ వర్క్స్‌ అధికారి వెంకటేష్‌, బస్తీ అధ్యక్షుడు రాంచందర్‌, బస్తీ వాసులు పాల్గొన్నారు.